## క్లుప్తంగా

### క్రీడామైదానం ఏర్పాటు చేయాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీస్టేడియం మధ్యలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయడంతో ఇరుకుగా ఉందని, మరో స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేయాలని క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జాతీయ రహదారి సమీపంలోని వాలంతరి క్షేత్రంలో స్థలం ఉందని, ఇక్కడ ఇంటిగ్రేటెడ్ స్కూల్ సైతం మంజూరైందన్నారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉంటుందని, అక్కడ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన మంత్రి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### చిరువ్యాపారుల సంక్షేమానికి లోక్ కల్యాణ్ మేళా



మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్‌గౌడ్

రాయికల్: చిరువ్యాపారుల సంక్షేమానికి లోక్ కల్యాణ్ మేళా ఎంతో దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో సోమవారం లోక్ కల్యాణ్ మేళాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు వీధి వ్యాపారులను గుర్తించి రూ.10–15 వేల రుణాలు అందిస్తామని, సక్రమంగా రుణం చెల్లించిన వారికి రూ.20 వేల వరకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ శరణ్య, ఆర్పీలు పాల్గొన్నారు.

### ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ



స్టాకు తనిఖీ చేస్తున్న ఏవో షాహిద్‌అలీ

మేడిపల్లి: మండలంలోని సీడ్స్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ సోమవారం తనిఖీలు నిర్వహించారు. యూరియా స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు సరుకులకు సంబంధించిన రసీదులు తప్పకుండా ఇవ్వాలని కోరారు. స్టాక్ సంబంధిత వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నమోదు చేయాలని కోరారు.

### పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

పెగడపల్లి: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం జాతీయ పోషికాహార మాసోత్సవాలను అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలకు పోషికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో డాక్టర్ అనూష, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### పెద్దపులి పుర్రెతో కోతులకు చెక్



రాయికల్: మండలంలోని అయోధ్య గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల వద్ద అల్లీపూర్‌కు చెందిన ఓ మహిళ మొక్కజొన్న కంకులు విక్రయిస్తుండటంతో తరుచూ కోతుల బెడద తీవ్రం కావడంతో పెద్దపులి పుర్రె తీసుకురావడంతో వాటిని చూసి కోతులు తిరిగి వెళ్లిపోతున్నాయి. వాటెన్ ఐడియా అంటూ అందరూ ఆశ్చర్యపోతున్నారు.



### పూలను పూజించే పండుగ బతుకమ్మ



ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అంటే మాకెంతో ఇష్టమైన వేడుక. ఉదయాన్నే లేచి పూలు సేకరించి బతుకమ్మలను పేర్చి ఆడుకోవడంలో ఉన్న ఆనందం మరుపురాని మధురానుభూతిని కలిగిస్తుంది.

– రాజీ వినాయకనగర్,జగిత్యాల

### అందరినీ ఒక్కటి చేసే పండుగ



ఏ పండుగైనా ఎవరి ఇళ్లలో వారే జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ మాత్రం తొమ్మిది రోజుల పాటు మహిళలందరినీ ఒక్క చోటకు చేర్చుతుంది. అదే బతుకమ్మ పండుగ ప్రత్యేకత. ఊరూ, వాడా చుట్టాలు, బంధువులను ఒక్కచోట కలిపే బతుకమ్మ అంటే మాకుటుంబమంతటికీ ఎంతో ఇష్టం.

– శరణ్య,జగిత్యాల

### శాస్త్రీయత, సంప్రదాయాల కలబోత



ప్రకృతి ఒడిలో లభించే తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను చూడటం ఆడటం ద్వారా ఒక మంచి ఫీలింగ్ కలుగుతుంది. 9 రోజులు ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మలను తీర్చిదిద్దడం సహజ సిద్ధమైన పిండి వంటలతో వాయినాలు ఇచ్చుకోవడం సాంప్రదాయంగా వస్తోంది.

– స్వప్న, జగిత్యాల

### బస్టాండ్ బురదమయం



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని బస్టాండ్‌లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి బురదమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు బస్టాండ్ వద్ద పెద్ద పెద్ద గుంతలు పడటంతో పాటు బురద కావడంతో బస్టాండ్‌లోకి వెళ్లివచ్చే ప్రయాణికులు గుంతలను దాటి, బురదలో నడుచుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడి బురదమయమైన బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే బస్టాండ్‌లో ఉన్న పెద్దపెద్ద గుంతలను పూడ్చి వేసి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండ చూడాలని మండల ప్రయాణికులు కోరుతున్నారు.

## గ్రామగ్రామాన దుర్గాదేవి ప్రతిష్ఠాపన



చిన్నమెట్‌పల్లిలో దుర్గామాతను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు





పెగడపల్లిలో దుర్గామాతకు పూజలు

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/మెట్‌పల్లి/పెగడపల్లి/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: దుర్గ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో దుర్గమాత విగ్రహాలను సోమవారం ఉదయం ప్రతిష్ఠించారు. దుర్గమాత విగ్రహాలకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాల్లో ప్రతిష్ఠించారు. అనంతరం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భవానీ దీక్షలు స్వీకరించారు.



మెట్‌పల్లి: ఉత్సవవిగ్రహాలతో వస్తున్న భక్తులు



తిమ్మాపూర్‌లో మండపంలో కొలువుదీరిన దుర్గామాత

### బతుకమ్మ వేడుకలు



రెడ్డి సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



జగిత్యాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జగిత్యాలరూరల్/ జగిత్యాలటౌన్: దరూర్ గ్రామ శివారులో రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, కాలనీలలో మహిళలు రెండో రోజు బతుకమ్మలతో ఆడిపాడారు.కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పెర వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: బతుకమ్మ సంబరాల్లో బాగంగా సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మహిళలు, విద్యార్థినులతో బతుకమ్మ సంబరాలు నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, అశోక్, పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని లచ్చక్కపేట శివ మల్లికార్జునస్వామి ఆలయం వద్ద గ్రామంలోని మహిళలు బతుకమ్మ ఆడి అనంతరం బతుకమ్మను బసమీప కుంటలో నిమజ్జనం చేశారు.



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పెద్ద బతుకమ్మ

జగిత్యాలటౌన్: బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా సోమవారం జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. తీరొక్కొ పూలతో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మను ప్రయాణికులు ప్రత్యేకంగా చూస్తున్నారు. డిపో మేనేజర్ కల్పన ప్రత్యేక చొరవతో ఈ భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.

### దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

సారంగాపూర్: దసరా సెలవుల్లో దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సారంగాపూర్, బీర్‌పూర్ ఎస్సైలు గీత, రాజు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ దసరా సెలవుల్లో దొంగలు ఇళ్లను దోచుకోవడానికి అవకాశం ఉంటుందని ఈ విషయంలో మీ ఇళ్లపై మీ సమీప ఇళ్ల వారిని నిఘా ఉంచాలని సూచించాలన్నారు. ఇళ్లలో బంగారం, వెండి, నగదు నిలువ ఉంచకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

### మార్కెట్ కమిటీ చైర్మన్‌కు మాజీ మంత్రి పరామర్శ

మెట్‌పల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ సోదరుడు గంగాధర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం గోవర్ధన్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ వాకిట సత్యంరెడ్డి, నాయకులు ఉన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి సోమవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు జలపతిరెడ్డి, ఆనంద్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

### ఒడ్డెలింగాపూర్‌లో వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామంలో స్వస్థ్ నారీ స్వశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించి 125 మందికి ప్రత్యేక చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఉష, వైద్యులు పాల్గొన్నారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

మల్లాపూర్: మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన ఆదిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి తెలిపారు.

**నేడు చెక్కులు పంపిణీ**

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

### మహిళా సంఘాలకు అవగాహన

మేడిపల్లి: మండలంలోని మహిళ సమాఖ్య సంఘాల అధ్యక్షులకు బ్యాంకుల రుణాలు, నగదు రహిత లావాదేవీలు, డిజిటల్ పేమెంట్స్ తదితర విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సునీత, మహిళా సమాఖ్య అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)–శ్రీ దుర్గ మండల సమాఖ్య కార్యాలయం లో సీబీవో ఆడిటర్ దేవయ్య సీసీలకు,వీవోఏకు వీవో అంతర్గత ఆడిట్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లేశం, ఆడిటర్ దేవయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సీసీలు వీవోఏలు పాల్గొన్నారు.

### ఆదివాసీ సంక్షేమ సేవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్

రాయికల్: ఆదివాసీ తోటి సంక్షేమ సేవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కుర్సెంగ ప్రసన్నకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ ఆత్రం కమల్ మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సంఘ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల చౌరస్తా వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఐదవు గంగారెడ్డికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గంగారెడ్డి రోడ్డును దాటుతుండగా... కారు ఢీకొట్టడంతో రోడ్డు ప్రక్కన పడిపోయి తీవ్రగాయాలపాలయ్యారు.చికిత్స కోసం జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా గెలుపొందిన పోలీసు టీంలను ఎస్పీ కార్యాలయంలో అభినందించి బహుమతులు అందించారు. మినీస్టేడియంలో జిల్లా క్రీడల యువజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, బ్యాడ్మింటన్‌లో పోలీస్ టీం విజేతగా నిలిచిందన్నారు. క్రికెట్‌లో మొదటి బహుమతి టీం కెప్టెన్ వినోద్‌రెడ్డి, బ్యాడ్మింటన్ విజేత కానిస్టేబుల్ రాజేందర్‌ను అభినందించారు. కార్యక్రమంలో రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు వినోద్‌రెడ్డి, దినేశ్, సుమన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపు సంబరాలు

జగిత్యాలటౌన్: జీఎస్టీ తగ్గింపును పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షా సమితి నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసీఎస్ రాజు, అరవలక్ష్మి, అక్కినపెల్లి కాశీనాథం, చిట్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: జీఎస్టీ శ్లాబుల తగ్గింపుపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని ఆలూరులో ప్రధాని మోదీ చిత్రపటానికి సోమవారం బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. జీఎస్టీ తగ్గింపు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మెక్కొండ రాంరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

ధర్మపురి: కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీపై జీఎస్టీ తొలగించడం హర్షనీయమని ఎల్ఐసీ ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ సుభాకర్ అన్నారు. ధర్మపురిలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం మేనేజర్ ఆధ్వర్యంలో ఏజెంట్లతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### అమ్మమ్మ ఆధార్ కార్డు అప్‌డేట్‌కు మనవడి తిప్పలు

కథలాపూర్: ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం వృద్ధులు ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన కామల్ల మల్లు అనే వృద్ధురాలు నడవలేని స్థితిలో మంచానికి పరిమితమయ్యారు. ఆధార్ అప్‌డేట్ కోసం వేలిముద్రలు, ఐరిస్ కొత్తగా నమోదు చేయాల్సి వచ్చింది. దీనికోసం కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రానికి మల్లును ఆమె మనుమడు చిన్న సాయబ్ ఎత్తుకొని తీసుకువచ్చారు. ఈ సన్నివేశాన్ని చూసిన పలువురు... వృద్ధులకు ఇంతటి సేవ చేసే మనుములు ఉన్నారా అంటూ చర్చించుకున్నారు.



ఆధార్ సెంటర్‌కు తీసుకొస్తున్న మనుమడు

### నళినికి అండగా నిలవండి

జగిత్యాలటౌన్: డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసి మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ డీఎస్పీ నళినికి ప్రభుత్వం అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఉద్యమ కాలంలో ఉద్యోగం కోల్పోయిన వారిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నళినికి అండగా నిలిచి మెరుగైన వైద్యం అందించాలని లేఖలో కోరారు. నళినికి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2 కోట్లు చెల్లించి ఆమెకు అండగా నిలవాలని లేఖలో పేర్కొన్నారు.

### బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

మేడిపల్లి: భీమారం, మేడిపల్లి మండలాల్లోని పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. బాదిత కుటుంబాలను పసునూర్ గ్రామంలో మాలోత్ సత్యనాయక్, కమ్మరిపేటలో నాంపల్లి నర్సయ్య బార్య అనారోగ్యంతో చనిపోగా, బాధిత కుటుంబాలను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు పునారపు రామానుజం కాలికి శస్త్రచికిత్స కాగా వారిని పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, నాయకులు ఉన్నారు.

### క్రీడా పోటీలకు ఆహ్వానం

కొడిమ్యాల: మై భారత్, యంగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో నాచుపల్లి ప్రభుత్వ పాఠశాల మైదానంలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హరీష్, సాయి శరణ్, లడ్డు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ రన్నింగ్ ,షాట్ పుట్, బాడ్మింటన్, చెస్ పోటీలు జరుగుతాయని ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

### నవగ్రహాల గోపురం నిర్మాణానికి భూమిపూజ

మల్లాపూర్: మండలంలోని రేగుంటలో శ్రీ అభయాంజనేయ ఆలయ ఆవరణలో నవగ్రహాల గోపురం నిర్మాణానికి సోమవారం అర్చకులు, గ్రామస్తులు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్ష పీఠం గురుస్వామి గనవేని మల్లేష్‌యాదవ్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### స్టీలు ప్లేట్లు గ్లాసుల వితరణ

జగిత్యాలటౌన్: ప్లాస్టిక్ నియంత్రణ మన అందరి బాధ్యత అని ప్రముఖ న్యాయవాది నాగిరెడ్డి మధుసూధన్‌రెడ్డి అన్నారు. ప్లాస్టిక్ మహమ్మారి నుండి మనల్ని మనం కాపాడుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ధరూర్ క్యాంపులో హోటల్ నిర్వహిస్తున్న లక్ష్మణ్‌కు సోమవారం 100 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా సిద్ధం

ఇబ్రహీంపట్నం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు, మండలంలోని గ్రామపంచాయతీలలో కులాల వారీగా ఓటర్ల జాబితాలను పంచాయతీ కార్యదర్శులు సిద్ధం చేస్తున్నారు. ఓటర్ల జాబితాలను ఎంపీడీవో మహ్మద్ సలీం ఒకొక్క కార్యదర్శి చేసిన జాబితాలను క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

### నిత్యావసర వస్తువుల పంపిణీ

ధర్మపురి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపనకు గురైన 40 నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో సోమవారం జిల్లా 320 గవర్నర్ లయన్ సింహరాజు కోదండ రాములు ప్రత్యేక చొరవతో 40 మంది నిరుపేద కుటుంబాలకు 6 వేల రూ.ల విలువ గల నిత్యావసర వస్తువులను జిల్లా ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్ ప్రోగ్రామ్ ప్రిసైడిగ్ అధికారి లయన్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ సమక్షంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రథమ ఉప గవర్నర్ మోరభద్రేశం, రెండో ఉప గవర్నర్ గుంటుక చంద్రప్రకాశ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడాల రవీందర్, జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన బ్లాక్ లెవెల్ స్పోర్ట్ మీట్

బుగ్గారం: మై భారత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న బ్లాక్ లెవెల్ స్పోర్ట్ మీట్ సోమవారం ముగిసింది. ఆటల పోటీల్లో విజేతలకు బాల్యవివాహాల నిరోధక ప్రాజెక్టు జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ భూమేశ్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మై భారత్ ప్రతినిధులు మారం గణేష్,సుంకం ప్రశాంత్,రాహుల్,బుగ్గారం జీపీ కార్యదర్శి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

### పాలకవర్గాల కొనసాగింపు బీఆర్ఎస్ విజయం



సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

మల్లాపూర్: సహకార సంఘాల్లో తొలగించిన విపక్ష పాలకవర్గాలను తిరిగి కొనసాగించాలని న్యాయస్థానం తీర్పు బీఆర్ఎస్ విజయమని మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన ఆదిరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా విపక్ష పాలకవర్గాలపై అవినీతి ఆరోపణలతో సింగిల్ విండో చైర్మన్లను తొలగించిందని, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు ముద్దం శరత్‌గౌడ్, చిట్యాల లక్ష్మణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.